క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: జనసేన పార్టీకి చెందిన పలువురు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం మండలంలోని గోపాలపురంలోని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం నుంచి బండారు సూర్యనారాయణ, పులసా సత్యనారాయణలు ఆత్రేయపురం మండల జెడ్పీటీసీ బోనం సాయిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

అప్పనపల్లిలో నంబర్-6 రేషన్ షాపు సీజ్

మామిడికుదురు: అప్పనపల్లిలో నంబర్-6 రేషన్ డిపోను సీజ్ చేశామని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ బుధవారం తెలిపారు. రేషన్ డిపోను సీజ్ చేయడంతో పాటు రేషన్ డీలర్ పి.పద్మావతిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అప్పనపల్లి రేషన్ డిపోను ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారని చెప్పారు. వరద బాధితులకు పంపిణీ చేయాల్సిన బియ్యంతో పాటు పీడీఎస్ బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు ఆయన గుర్తించి ఈ రేషన్ డీలర్‌పై చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేశారన్నారు. కిరణ్ సూచనల మేరకు రెవెన్యూ అధికారులు రేషన్ డిపోను తనిఖీ చేశారని చెప్పారు. 5వ నంబర్ రేషన్ డిపో డీలర్‌కు ఆరో నంబర్ రేషన్ డిపో నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు.

గాంధీ ఆశయాలను పాటించాలి

అంబాజీపేట: మహాత్మా గాంధీజీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించి ఆయన కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.పెదపూడిలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పూర్వం నుంచి ఉన్న గాంధీ విగ్రహం శిథిలమై పోవడంతో గ్రామస్తుల సహకారంతో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీలా శాంతి మార్గంలో పయనించేలా తమ వంతు కృషి చేయాలన్నారు. కమిటీ సభ్యులు వాసర్ల మరిడి, చిక్కం రాము, అంబటి శ్రీను, ఉందుర్తి జీవరత్నం, బొడ్డేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



పోతవరం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: విద్యాభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంఈఓలు కోన హెలీనా, సీహెచ్ బ్రహ్మానందరావు అన్నారు. పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న హెచ్ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు రూ.23 వేలతో కొనుగోలు చేసిన నోటు పుస్తకాలు, పలకలు తదితర విద్యా సామగ్రిని ఎంఈఓలు బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఆనందరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. హెలీనా, బ్రహ్మానందరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న హెచ్ఎం ఆనందరావును అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, ఉపాధ్యాయ నాయకుడు నల్లా బాలాజీ, నందెపు హనుమంతరావు, ఎ.సూర్యనారాయణ, యర్రా శేషుకుమారి, కుసుమ దుర్గ, ముత్యాలరావు, సీఆర్పీ రంప రవీంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కొత్తపేట: ఉరి వేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బిళ్లకుర్రు శివారు తొరెట్లవారిపేట అంబేడ్కర్ కాలనీకి చెందిన చింతా యోగేష్‌కుమార్ (33) ఈ నెల 7 రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. భోజనం విషయంలో తన భార్య వెంకటలక్ష్మితో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన యోగేష్ గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అతని భార్య వెళ్లి చూడగా చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్తాల

అయినవిల్లి: మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని శంకరాయగూడేనికి చెందిన సత్తాల కృష్ణ నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్టు సత్తాల కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

నులిమేద్దాం

- నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- చిన్నారుల్లో ఆరోగ్య రుగ్మతల కట్టడి
- విజయవంతం చేయాలని వైద్యశాఖ పిలుపు



పెదపళ్లలో డీవార్మింగ్ డే విజయవంతానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

ఆలమూరు: చిన్నారులకు తరచూ కడుపులో సంభవించే రక్తహీనత, నిద్రలేమి, నీరసం, కడుపునొప్పి తదితర రుగ్మతలను నివారించేందుకు ఏటా ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీవార్మింగ్ డే ను నిర్వహిస్తున్నాయి. చిన్నారుల్లో నులిపురుగు నివారణకు ఏడాదికి రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా చిన్నారులకు మరింత ఆరోగ్యం చేకూరి చురుకుతనం ఏర్పడుతుంది. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10, 17 తేదీల్లో డీవార్మింగ్ డే నిర్వహిస్తున్న సందర్భంగా కొత్తపేట, రాజోలు పి.గన్నవరం నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల్లో నులిపురుగు నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశ సిబ్బందితో విరివిగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక డీవార్మింగ్ డేలో మాతా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్. ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఈ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. డీవార్మింగ్ డేను విజయవంతం చేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. 68 మంది వైద్యాధికారులు, 23 మంది ఫార్మాసిస్టులతో పాటు వందలాది మంది ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 23 పీహెచ్‌సీలు, 852 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో నున్న సుమారు 75 వేల మంది విద్యార్థులు, పది వేల మంది చిన్నారులకు ఈ ఆల్బెండజోల్ మాత్రలను వేసేందుకు సర్వం సిద్ధమైంది.

ఆల్బెండజోల్‌ను మోతాదుకు అనుగుణంగా తీసుకోవాలి

ఆల్బెండజోల్ మాత్రలను మింగించేటప్పుడు తప్పక జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు, విద్యార్థుల వయస్సును బట్టి మాత్రలను అందించాలి. ఏడాది లోపు చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగించరాదు. 1-2 ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలో సగం మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలి. 2-5 యేళ్ల లోపు పిల్లలకు మాత్రను పొడి చేసి పూర్తిగా నీటిలో కలిపి తాగించాలి. 6-19 యేళ్ల లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు మాత్రం మాత్రను మింగించాలి. ఈ మాత్రలను మధ్యాహ్న భోజనం చేసిన తరువాత మాత్రమే మింగించాలి. లేకుంటే మాత్రలు మింగిన వారికి వాంతులు, విరేచనాలు, కడుపులో తిప్పడం వంటి దుష్ఫలితాలు సంభవించే అవకాశం ఉంది.

నులిపురుగు ప్రభావం ఇబ్బందికరం

కడుపులో పేరుకుపోయిన నులిపురుగు వల్ల పిల్లల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. పిల్లల కడుపులో సంభవించే కొంకి, నులి, బద్దె తదితర గుండ్రని పురుగులు రక్తాన్ని పీల్చేస్తాయి. ఆ పురుగుల ఎదుగుదల పూర్తిగా పిల్లల కడుపులోనే జరగడం వల్ల ఎదుగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు తీసుకునే ఆహారం అంతా ఆ పురుగులే పీల్చేస్తాయి. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలకు అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడి శారీరక సమస్యలు ఏర్పడతాయి. నులిపురుగులు ఉన్న పిల్లలు మలం వల్ల నేల కలుషితం అవుతుంది. దీనివల్ల క్రిములు మళ్లీ వృద్ధి చెంది గుడ్లను ఉత్పత్తి చేసి మళ్లీ పిల్లలకు అనారోగ్యం కలగజేస్తాయి

సంపూర్ణ ఆరోగ్యం



వయస్సుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవడం ద్వారా పిల్లలుక సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుంది. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కుని మాత్రలను తీసుకుని వేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి.

– ఆర్.సుదర్శన్‌బాబు, వైద్యాధికారి, పీహెచ్‌సీ. పెదపళ్ల

ఏర్పాట్లు పూర్తి



డీవార్మింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో మోతాదుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తాం. ఏ విధమైన దుష్పరిణామలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఒకటి నుంచి 17 యేళ్ల లోపు పిల్లలందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– పి.ఉమ, హెల్త్ విజిటర్, పీహెచ్‌సీ, పెదపళ్ల

ఒక నామినేషన్ దాఖలు

అంబాజీపేట: మాచవరం పంచాయతీకి 13వ వార్డుకు సంబంధించి ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ బుధవారం తెలిపారు. గురువారంతో నామినేషన్ ప్రక్రియ ముగియనుందన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహణ

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యం మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని సీడీపీఓ పి.శారద అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో ప్రాజెక్టు పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ, ప్రీస్కూల్ నిర్వహణ తదితర అంశాలపై సీడీపీఓ సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు ఇంటికే పోషకాహారం కిట్లు పంపిణీ నూరు శాతం అమలు జరగాలని, అది ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో చూపించాలన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం

మామిడికుదురు: గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో మొగలికుదురులో ఆరు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ కడి అరుణకుమారి, ఎంపీటీసీ కొప్పిశెట్టి దుర్గాపార్వతీదేవి ఆధ్వర్యంలో 369 మీటర్ల మేర ఆరు సిమెంట్ కాంక్రీట్ రోడ్లను నిర్మించారు. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన గడప గడపకూ కార్యక్రమం ద్వారా పలు సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయని సర్పంచ్, ఎంపీటీసీలు పేర్కొన్నారు.

మాతృ, శిశు మరణాల నివారణే ధ్యేయంగా పని చేయాలి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలానాయుడు అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా బుధవారం సుమారు 126 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాజోలులో గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాపాక



అంబాజీపేటలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: గర్భిణులు మూడో నెల నుంచి తొమ్మిదో నెల వరకూ ఆరోగ్య సూత్రాలతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌ను వైద్యాధికారి వి.గౌతమి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గర్భిణులను పరీక్షించి ఐరన్ మాత్రలు, సిరప్‌లను అందజేశారు. అనంతరం అంబాజీపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

సంధిపూడిలో..

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, సర్పంచ్ తోట భవాని, ఎంపీటీసీ తోలేటి సంతోషి ఆధ్వర్యంలో కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీవో పి.శారద ఆదేశాల మేరకు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు పోలాబత్తుల చిన్న, సిద్ధిరెడ్డి శివ, కారదర్శి ఎస్.వీర్రాజు, గ్రామ రెవెన్యూ అధికారి పి.సత్యనారాయణ, తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ కిట్లు గర్భిణుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం వేగివారిపాలెంలో సంపూర్ణ ఆరోగ్య కిట్లను ఎమ్మెల్యే రాపాక పంపిణీ చేశారు. సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే సోంపల్లిలో సర్పంచ్ కట్టా శ్రీనివారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించి సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

రాజోలు: సేవాభావాన్ని విద్యార్థుల్లో అలవాటు చేసేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులను ఆహ్వానించి దీక్షా ప్రమాణం చేయించారు. స్కౌట్స్ పతాకాన్ని ఎగరవేశారు. ప్రధానోపాధ్యాయుడు డి.హరనాథ్, కట్టా కృష్ణప్రసాద్, యెరుబండి నాగేశ్వరరావు, ఎ.శ్రీమన్నారాయణ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



స్కౌట్స్ శిక్షణలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తున్న గోపాలకృష్ణ

సాంకేతిక విద్యతో నైపుణ్యం సాధించాలి

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ సాంకేతిక విద్యతో నైపుణ్యాలు సాధించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి విద్యార్థులకు ఉద్బోధించారు. దించారు. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కృతా ఫౌండేషన్ (వాడపాలెం), పడాల చారిటబుల్ ట్రస్ట్ (కాకినాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) ద్వారా జీవన నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్, కౌమార విద్య తదితర అంశాలపై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. మూడోరోజు బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి అనేక సహాయ, సౌకర్య, ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇంగ్లీషు మీడియం, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ క్లాసులతో కార్పొరేట్ స్థాయి విద్యాబోధన అమలు చేస్తుందన్నారు. దీనికి తోడు కృతా ఫౌండేషన్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా పాఠశాల స్థాయిలోనే జీవన నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులు విద్యార్థులకు మరింతగా దోహదపడతాయన్నారు. పడాల ట్రస్ట్ సీఈఓ పడాల సూర్యప్రసాద్, కృత ఫౌండేషన్ చైర్మన్ బండారు సూర్యప్రకాష్‌ల సేవాదృక్పథాన్ని అభినందించారు. పాఠశాల తరపున పడాల ట్రస్ట్ సీఈఓ సూర్యప్రసాద్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, జిల్లా యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, హెచ్ఎం వై.చంద్రశేఖర్, స్టాఫ్ సెక్రటరీ నల్లం సత్యనారాయణరావు, కృత, పడాల ట్రస్ట్‌ల సభ్యులు కురచ ప్రకాశరావు, గున్నేశ్వరరావు, బి.గంగరాజు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నా భూమి-నా దేశం కార్యక్రమం

మామిడికుదురు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈదరాడలో బుధవారం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో 'నా భూమి-నా దేశం' నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం జరిగింది. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలతో అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మేడిది సీతారామ్, జేఈ పేరాబత్తుల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బి.దుర్గేశ్వరి, స్థానిక పెద్దలు యెరుబండి సూరిబాబు, కుసుమ శ్రీధర్, చేట్ల సత్యనారాయణ, యెరుబండి సత్యనారాయణమూర్తి, యెరుబండి లక్ష్మయ్య, వద్దే ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని గొంది దొండపాటివారి గ్రూపులో బుధవారం సర్పంచ్ దొండపాటి రవి కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరవీరుల స్మారక ఫలకాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ఆవిష్కరించారు. నాభూమి, నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎంపీడీవో జి.భీమారావు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నిజ నివాళి అని, పుడమతల్లిని కాపాడుదాం అని పంచ ప్రాన్ ప్రతిజ్ఞ చేశారు. వసుధకు వందనం చేస్తూ పంచాయతీలో మొక్కలను నాటారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు వారు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి పథకం వేతనదారులు పాల్గొన్నారు.



ఈదరాడలో జరిగిన నా భూమి-నా దేశంలో పాల్గొన్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

గ్రావెల్ రోడ్డు నిర్మాణం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో రూ.మూడు లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్ చౌదరి పరిశీలించారు. మండల ప్రజా పరిషత్ నుంచి మంజూరైన ఈ నిధులను వెచ్చించి రైతులు ఉపయోగపడే విధంగా పుంత రోడ్డును అభివృద్ధి పనులు చేపట్టడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రావులపాలెం: కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలను అందిచడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెదిరేశ్వరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి గ్రామ సచివాలయం-1 పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలు ఏమైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వెదిరేశ్వరంలో తమ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వివిధ లబ్ధిదారులైన బీసీలకు రూ.19.12 కోట్లు, ఎస్సీలకు రూ.2.95 కోట్లు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.46.82 లక్షలు, మైనారిటీలకు 12.75 లక్షలు, కాపు లబ్ధిదారులకు రూ.1.22 కోట్లు, ఇతర సామాజిక వర్గాల లబ్ధిదారులకు రూ.9.61 కోట్లు, మొత్తంగా వెదిరేశ్వరంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.33.50 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో వివిధ డ్రైనేజీలు, రోడ్లు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ భవనం నిర్మించి ప్రారంభించామన్నారు. మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్ బొక్కా కరుణాకరం, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీటీసీ నామాల వీరాస్వామి, దండు సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.



వెదిరేశ్వరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రాష్ట్రంలో విమర్శలు లేని పాలన

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విమర్శలు లేని పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. బుధవారం మండలంలోని వీరవల్లిపాలెంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, స్థానిక అధికారులు సేవలు సక్రమంగా అందిస్తున్నారా? లేదా అని అడిగారు. ఏవరైనా అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, మట్టపర్తి వెంకటరమణ, మిండగుదిటి చిన్ని, మిండగుదిటి శిరీష్, మిండగుదిటి రాంబాబు, కోరపు రవి, అత్తిలి ఏడుకొండలు, మర్రి అంజిబాబు, అడపా కొండ, దాసరి బాబులు తదితరులు పాల్గొన్నారు.



వీరవల్లిపాలెంలో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కాలనీ స్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ



విశ్వేశ్వరాయపురం కాలనీలో పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ ఇజ్రాయేలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో కాలనీ స్కూల్‌ను బుధవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు సందర్శించారు. స్కూల్‌లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌ను, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులకు వైద్య పరంగా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తొలుత బాబు జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు శెట్టిం శ్రీనివాస్ ఆధ్వర్యాన ఎమ్మెల్సీని సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కేవీఎస్ఎన్ రాజు, రాపాక వెంకట్‌రామ్, జి.సత్యనారాయణ, ఎస్.మురళి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు సముచిత స్థానం

కొత్తపేట: నియోజకవర్గంలో రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల చైర్మన్ పదవులు శెట్టిబలిజలకు కేటాయించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి ఆ సామాజిక వర్గ మండల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. స్థానిక ఆర్ఎస్ కన్వెన్షన్ హాలులో మండల శెట్టిబలిజ సంఘ సమావేశం పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. నియోజకవర్గ చరిత్రలో ఏఎంసీ చైర్మన్ పదవిని ఏ రాజకీయ పార్టీ కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. శెట్టిబలిజలపై జగ్గిరెడ్డి చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. ఇటీవల టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో శెట్టిబలిజ వర్గానికి చెందిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి విషయంలో ప్రొటోకాల్ పాటించకపోవడం ఆమెను అవమానించడమేనని నాయకులు అన్నారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.సత్తిపండు, రెడ్డి చంటి, డి.సుబ్రహ్మణ్యం, కె.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, పి.రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల శెట్టిబలిజ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సమావేశమైన శెట్టిబలిజ సంఘ నాయకులు

పిల్లలతో మాత్రలు మింగించాలి

పి.గన్నవరం: నులిపురుగుల నివారణకు ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వై.శ్రీవల్లి తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి ఈనెల 17 వరకూ మాత్రలను పంపిణీ చేయనున్నారు.

ఘనంగా హీరో మహేష్ పుట్టినరోజు

అంబాజీపేట: సినీ హీరో మహేష్‌బాబు తన సేవలతో అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచాడని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎస్ఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ అన్నారు. అంబాజీపేటలో మహేష్‌బాబు ఫ్యాన్స్ పర్యవేక్షణలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొమ్మేటి రవికుమార్, ఉపాధ్యక్షుడు పితాని జయకృష్ణల ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యవసరాలను 50 మంది రిక్షా కార్మికులకు, అమలాపురం కామాక్షి పీఠంలోను, బండారులంక అనాథాశ్రమంలోను 200 మందికి భోజనాలను పంపిణీ చేశారు.

కొత్తపేట: సినీ హీరో మహేష్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గౌతమీనగర్ యువత ఆధ్వర్యంలో 30 మంది మహేష్‌బాబు అభిమానులు రక్తదానం చేశారు.

ఆలమూరు: స్థానిక జిల్లా మహేష్‌బాబు ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు నాతి కుమార్‌రాజా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు, గర్భిణులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.



అంబాజీపేటలో రిక్షా కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం చేస్తున్న హీరో మహేష్‌బాబు అభిమానులు

మలికిపురం: హీరో మహేష్‌బాబు అభిమానులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు కేక్‌ను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కట్ చేశారు. ఈ సందర్భంగా మహేష్ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.